క్లుప్తంగా

సేవాగుణం పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏలేశ్వరం: విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం జాతీయ సేవాపథకం దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంచడమే ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. విద్యార్థులు సేవా గుణం అలవరుచుకోవాలన్నారు. ఈ ఏడాది కళాశాలలో 38 సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్, వీరభద్రరావు, బంగార్రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదయాత్రగా విజయవాడకు భవానీలు

శంఖవరం: గ్రామానికి చెందిన భవానీలు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గురు భవానీ మొగిలి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మాలలు ధరించిన భవానీలు స్థానిక వేపారమ్మ అమ్మవారి గుడి వద్ద నుంచి పాదయాత్రగా బయలుదేరారు. దసరా వేడుకల సందర్భంగా విజయవాడ అమ్మవారి సన్నిధిలో మాలధారణ సమర్పిస్తామన్నారు.

సూక్ష్మ పోషకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: వరి సాగులో సూక్ష్మ పోషకాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ జగ్గప్పారావు సూచించారు. కేఏ మల్లవరం, కోటనందూరు, అల్లిపూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వరిలో జింక్, పొటాష్ లోపం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. తగిన మోతాదులో జింక్ పిచికారీ చేయాలని, ఎకరాకు 15 కేజీల చొప్పున పొటాష్ వేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలో పంటను దోమ ఆశిస్తుందని, వాటి నివారణకు పసుపు జిగురు అట్టలను వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ



అచ్యుతాపురంలో మేజిక్ డ్రైన్ నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న మేజిక్ డ్రైన్‌లపై పలు జిల్లాలకు చెందిన ఉపాధి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా డ్వామా పీడీ ఎ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందికి మేజిక్ డ్రైన్‌లపై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి విజయవాడ నుంచి కమిషనరేట్, ముఖ్య క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ పాల్గొని మేజిక్ డ్రైన్‌ల నిర్మాణాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామంలో నిర్మిస్తున్న మేజిక్ డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శ్రీను, ఏపీఓ అప్పలరాజు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు

గండేపల్లి: అనుమతులు లేని ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని మల్లేపల్లిలో పీఏసీఎస్, శ్రీదేవి ఎంటర్‌ప్రైజెస్, శ్రీగణేష్ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎరువులు, పురుగు మందుల వివరాలు తెలుసుకొని నాణ్యత పరీక్షల కోసం స్టాక్ నుంచి శాంపిల్స్ సేకరించామన్నారు. ఈయన వెంట గండేపల్లి ఏఓ లక్ష్మి, ఏఈఓ చంద్రమౌళి ఉన్నారు.

'సశక్తి పరివార్'తో సంపూర్ణ ఆరోగ్యం

కిర్లంపూడి: స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్‌తో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్ వైద్యులు రాంబాబు నాయక్, సాయి హేమాంజలీ, కాకినాడ జీజీహెచ్ వైద్యులు రవి, ప్రియంక పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాంబాబు నాయక్ మాట్లాడుతూ, 84 మందికి సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా ఇద్దరి మహిళల్లో సర్వికల్ క్యాన్సర్ ఉన్నట్టు తెలిపారు. సర్పంచ్ సభ్యుడు గుడాల రాంబాబు, బీజేపీ నాయకులు సింగిల్ దేవ్ సత్తిరాజు, యడాలి రాంబాబు తదితరులు ఉన్నారు.

కియోస్క్‌లపై కినుకు..!

- రైతులకు సకాలంలో అందని సేవలు
- సాంకేతిక లోపంతో పనిచేయని యంత్రాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చే విధంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు ముంగిటకే అన్ని రకాల సేవలు అందజేసింది. ఈ నేపథ్యంలోనే కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలు రాయితీతో అందించేవారు. అయితే, ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారడంతో వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందని పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో ఎన్ని యంత్రాలంటే?

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో రైతు సేవా కేంద్రాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 84 కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనే నినాదంతో రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందించే ప్రయోజనాలు ఆన్‌లైన్ చేసే వారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం రైతులు ముందస్తుగా నమోదు చేసి వాటికి నగదు చెల్లించేవారు. మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు చేతికందేవి. ఫలితంగా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు చేతికి అందేవి. రైతు సేవా మిత్రల హాజరు, వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పుల వాటి ముందస్తు సమాచారం సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలిసేవి. వాటి ఆధారంగా వ్యవసాయ సిబ్బంది రైతులను అప్రమత్తం చేసేవారు. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపర్చి ఉండేది. అయితే, ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.



ధర్మవరంలో రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

సేవలు పునరుద్ధరించాలి



రైతులకు పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలు పునరుద్ధరించాలి. వ్యవసాయ యాప్‌ల గురించి అవగాహన కల్పించి, మారుతున్న కాలానుగుణంగా దిగుబడులు పెంచడానికి కృషి చేయాలి. ఆర్‌ఎస్కేలోని కియోస్క్ మెషిన్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి దొరబాబు, ఉత్తరకంచి, ప్రత్తిపాడు మండలం.

మొబైల్ యాప్ ద్వారా సేవలు



కియోస్క్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సిబ్బంది అందజేస్తున్నారు. రైతుల సౌలభ్యం కోసం సెల్‌ఫోన్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాం.

– జోకా అమృత, ఏఓ, ప్రత్తిపాడు.

పేరు మారింది.. సేవలు నిలిచాయి..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)గా పేరు మార్చింది. సేవా కేంద్రాలుగా పేరుకే మారాయి. కానీ, రైతుకు సేవలు అందజేయడంలో విఫలమయ్యారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. కొన్నిచోట్ల పూర్తిగా వాటిని విస్మరించడంతో మూలకు పెట్టేశారు. వచ్చే సీజన్‌లోనైనా వాటిని వాడకంలోకి తీసుకొచ్చి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా వ్యవసాయానికి చేయూత అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచారం ప్రారంభం



కోటనందూరులో సత్యానందం దంపతుల ఆశీర్వాదం తీసుకుంటున్న అభ్యర్థి కృష్ణ

కోటనందూరు: సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాలతో కోట నందూరు సర్పంచ్ అభ్యర్థిగా నియమించబడ్డ కొరుప్రోలు కృష్ణ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ప్రముఖ వ్యాపారవేత్త, తుని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ స్వగృహానికి వెళ్లారు. కృష్ణాజీ తల్లిదండ్రులు వెలగా సత్యానందం దంపతుల ఆశీర్వాదం తీసుకొని ప్రచారానికి తెరతీశారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ప్రచారం చేసి గెలుపుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నారాయణమూర్తిరాజు, గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, చిటికెల రమణ, మళ్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరస్తుల కదలికలతో జాగ్రత్త

గండేపల్లి: నేరస్తుల కదలికలు ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలని షాపు యజమానులకు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో పెట్రోల్ బంకులు, షాపుల్లో గోల్డ్, సిల్వర్ వంటి విలువైన ఆభరణాలు, నగదు ఉంచరాదని, తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి అలర్ట్ సైరన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

పార్టీ సమావేశానికి హాజరైన నరసింహం

జగ్గంపేట: తాడేపల్లిలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం, రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి తోట శ్రీరాంజీ హాజరయ్యారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ పార్టీ నేతలు పాల్గొన్నారు.



తాడేపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న తోట నరసింహం, తోట రాంజీ

చెల్లుబోయిన వేణును కలిసిన గిరిబాబు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు హాజరయ్యారు. అనంతరం మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు జక్కంపూడి రాజాను కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ బలోపేతంతో పాటు పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని యువజన అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని రాజా గిరిబాబుకు సూచించారు.



తాడేపల్లిలో చెల్లిబోయిన వేణు, జక్కంపూడి రాజాను కలిసిన గిరిబాబు

అధినేతతో ఆత్మీయ కలయిక



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మురళీకృష్ణంరాజు



తాడేపల్లిలో జగన్‌ను కలిసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం

ప్రత్తిపాడు రూరల్: తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వంగా కలిశారు. వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం జగన్‌ను కలిశారు.

జగన్‌ను కలిసిన రఘురాం

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జగ్గంపేటకు చెందిన ఒమ్మి రఘురాం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు రాష్ట్ర కార్యదర్శి పదవితో పాటు, రెండు నియోజకవర్గాలకు పరిశీలకునిగా బాధ్యతలు అప్పగించినందుకు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వెళ్లిన సందర్భంగా జగన్‌ను కలిసినట్లు ఆయన జగ్గంపేటలో తెలిపారు.

ఆ తీర్మానం రద్దు చేయాలి



తునిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: కార్మికుల పని గంటలు పెంచుతూ శాసనసభలో ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ నిరసనకు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపి దీక్షా శిబిరంలో కూర్చున్నారు. సీఐటియూ పట్టణ కార్యదర్శి నక్కెళ్ల శ్రీనివాస్, కోటనందూరు మండల కార్యదర్శి షేక్ పద్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ కార్మికులను బానిసలుగా మార్చేందుకే పని గంటల పెంపు నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం కార్మికులకు వెన్నుపోటు పొడవడమేనని మండిపడ్డారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు కామేశ్వరి, బాబూరావు, అనిల్‌కుమార్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకి ఇరువైపులా పెరిగిన తుప్పలు



ఏలేశ్వరంలో రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. స్థానిక షిర్డినగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలో సీసీరోడ్డుకు ఇరువైపులా విపరీతంగా తుప్పలు పెరిగిపోయాయి. ఈ రహదారిలో వెళ్లే ద్విచక్రవాహనాలు తప్పుకొనేందుకు వీలులేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి తుప్పలతో మూసుకుపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పాటు పాముల బెడద ఎక్కువగా ఉండటంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వాహనాల పార్కింగ్ నియంత్రణకు చర్యలు



తాళ్లూరు శివారులో ట్రయిల్ రన్ సైరన్‌ను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

గండేపల్లి: హైవేలో వాహనాలు పార్కింగ్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు సీఐ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైవేలో వాహనాలు పార్కింగ్ చేస్తే సైరన్, ఎస్‌ఎంఎస్, ఫోన్ ద్వారా పోలీస్ సిబ్బందిని అలెర్ట్ చేస్తామని, తద్వారా వాహనాన్ని హైవేపై నుంచి పక్కకు పెట్టిస్తామన్నారు. విజయవాడకు చెందిన కేవై సొల్యూషన్స్ ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేయించడం ద్వారా (యాంటీ పార్కింగ్ లేజర్ సిస్టం) వాహనం పార్కింగ్ చేసిన తక్షణమే ఐదుగురు పోలీస్ సిబ్బందికి అలెర్ట్ సమాచారం వస్తుందన్నారు. మండలంలోని తాళ్లూరు శివారులో బుధవారం ట్రయిల్ రన్ వేశామని, ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొట్టే ప్రమాదాలను పూర్తిగా నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆదిత్య ప్రొఫెసర్లు

గండేపల్లి: ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాకు సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఎంపికైనట్టు ప్రో ఛాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. తమ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు అధ్యాపకులు ప్రతిష్ఠాత్మక ఎల్సేవియర్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ తయారుచేసిన ప్రపంచంలోని టాప్–2 శాతం శాస్త్రవేత్తల జాబితా–2025లో చోటు దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. అధ్యాపకులు ఎలుమలై, మహేష్ కుమార్ సింగ్, బెల్లం రామ్మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్య రంజిత్ పసుపులేటి, తాతబాబు అద్దేపల్లిలు ఎంపికైనట్టు తెలిపారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ అడ్మిషన్లకు నెట్‌క్వాలిఫై అయిన వారితో భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఉన్న మిగతా యూనివర్సిటీలు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని, సాంకేతిక వర్సిటీలో అడ్మిషన్లు భర్తీ చేసి ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలన్నారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

అన్నపూర్ణా..నమోస్తుతే..

ఏలేశ్వరం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. నవరాత్రుల మూడో రోజు కావడంతో ఆలయాలకు మహిళలు పోటెత్తారు. మండల వ్యాప్తంగా శరన్నవరాత్రులను పురస్కరించుకుని రాత్రి వేళల్లో ఆలయాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కిర్లంపూడి: మండలంలోని శరన్నవరాత్ర మహోత్సవాలు 3వ రోజు ఘనంగా జరిగాయి. కిర్లంపూడిలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ, జగపతినగరం అభయ దుర్గమ్మ, కుమ్మరివీధి, రామచంద్రపురం, వీరవరంలో ఉన్న దుర్గమ్మ బుధవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శంఖవరం: దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణలో కుంకుమ పూజలు నిర్వహించారు.

తలుపులమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ

తుని రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారికి అన్నపూర్ణదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించగా భవానీ భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు కార్య నిర్వాహక అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. నాలుగోవ రోజు గురువారం కాత్యాయని దేవి అలంకరణ చేసి భక్తులను దర్శనాలకు అనుమతి స్తామన్నారు..

గోకవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోకవరంలో దేవీచౌక్, వీరభద్రుని గద్దెలో ఉన్న కనకదుర్గ అమ్మవారు అన్న పూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీచౌక్ ఆలయంలో ఉదయం నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి నక్షత్ర హారతులు ఇచ్చారు. అలాగే వీరభద్రునిగద్దెలో ఉన్న కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మీనాక్షి దేవి అలంకరణలో నేరేళ్లమ్మ

తొండంగి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు బుధవారం మీనాక్షి దేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. అమ్మ వారికి పంచామృతాభిషేకాలు, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన దాతలు కుమిలి రాంబాబు, లక్ష్మి దంపతుల సహకారంతో అమ్మవారిని మీనాక్షి దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 3వ రోజైన బుధవారం దుర్గాదేవి అమ్మ వారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపితకుచాంబా, ధర్మవరం సూర్యరావుపేటలో కనకదుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గను అన్నపూర్ణదేవిగా అలంకరించారు. మండలంలోని పెద్దిపాలెం, ఉత్తరకంచి, రాచపల్లి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు అమ్మవారికి అలంకార పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.



గోపాలపట్నంలో మీనాక్షి దేవి అలంకరణలో నేరేళ్లమ్మ



ఏలేశ్వరంలో అన్నపూర్ణా దేవిగా అమ్మవారు



అన్నపూర్ణగా కిర్లంపూడి వాసవీ కన్యకా పరమేశ్వరీ



అన్నపూర్ణా దేవిగా అలంకరణలో తలుపులమ్మ తల్లి



అన్నపూర్ణగా గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ